నమస్తే తెలంగాణ

సూర్యాపేట

12 | నల్లగొండ, ఆదివారం 12 జనవరి 2025 | SURYAPET

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలు, ప్రభుత్వ వైఫల్యాలను తూర్పారబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేని యూత్ కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపైకి ఎగబడ్డారు. కుర్చీలు, అద్దాలు విరగ్గొట్టి విధ్వంసం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేటీఆర్ చిత్రపటాలను కింద పడేశారు. బీఆర్ఎస్ ఫ్లెక్సీలను చింపేశారు. లోపల రూమ్‌లోకి వెళ్లి టీవీని పగులగొట్టి అరాచకం సృష్టించారు. అంతటితో ఆగక పార్టీ కార్యాలయం ముందు బైఠాయించగా.. పోలీసులు వారిని అరెస్ట్ చేసి, అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్ఎస్ పదేండ్ల పాలన ప్రశాంతం

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంత వాతావరణం ఉండేది. ప్రజాప్రతినిధుల మధ్య రాజకీయ విమర్శలే తప్ప వ్యక్తిగత దూషణలు, దాడులు, దౌర్జన్యాలు ఉండేవి కాదు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఆరోపణలు చేసినా అధికార పార్టీ నేతలు మాటలతోనే సమాధానం ఇచ్చేవారు. భువనగిరి నియోజకవర్గంలో ఏ ఒక్క చిన్న ఘటన కూడా చోటుచేసుకున్న దాఖలాలు లేవు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి ఏడాది పాలనలో అరాచకాల మీద అరాచకాలు చేస్తున్నది. దశాబ్దం పాటు ప్రశాంతంగా ఉన్న భువనగిరిని ప్రాంతంలో మళ్లీ ఘర్షణ వాతవరణంతో భయాందోళనలు సృష్టిస్తున్నది.


యూత్ కాంగ్రెస్ నాయకుల దాడిలో ధ్వంసమైన బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం కిటికీ అద్దాలు

భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేసిన టీవీ

కాంగ్రెస్ గూండాగిరీ

ప్రశ్నిస్తే దాడులు.. దౌర్జన్యాలు

భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

- రోజురోజుకూ పెట్రేగిపోతున్న అరాచకం
- భువనగిరిలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి
- గతంలోనూ కాంగ్రెస్ దాడులు.. జడ్పీ చైర్మన్‌పై ఎటాక్
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రశాంతంగా ఉన్న భువనగిరిలో ఉద్రిక్త పరిస్థితులు

యాదాద్రి భువనగిరి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : హామీల అమలుపై ప్రశ్నించినా, ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు నిలబడినా ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ విధ్వంసాలకు తెగబడుతున్నది. నేరుగా దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నది. అడ్డూఅదుపు లేకుండా అరాచకాలకు పాల్పడుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాడులు, దౌర్జన్యాల సంస్కృతి పేట్రేగిపోతున్నది. తాజాగా భువనగిరిలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై విధ్వంసానికి పాల్పడి కాంగ్రెస్ కాంగ్రెస్ మారు తన దాడుల సంస్కృతిని బయటపెట్టుకున్నది.

భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

గతంలోనూ పలు ఘటనలు..

కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో అనేక చోట్ల దాడులు జరిగాయి. గతేడాది జనవరి 30న అప్పటి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. నాడు మంత్రి కోమటిరెడ్డి సమక్షంలో సందీప్‌రెడ్డిపై దాడికి దిగారు. ఓ కార్యకర్త ఏకంగా భుజంపై కొట్టి, ముందుకు నెట్టారు. ఆ సందర్భంలోనూ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తాయి. శుక్రవారం భువనగిరిలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలోనూ ఘర్షణ వాతావరణం నెలకొంది. గతంలో సూర్యాపేట మున్సిపల్ కౌన్సిలర్ పావనీకృపాకర్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్లు దాడి చేశారు. ఇంటిపై రాళ్లు, కోడి గుడ్లు విసిరి భయానక వాతావరణం సృష్టించారు.

టెన్షన్.. టెన్షన్

బీఆర్ఎస్ పార్టీ కార్యాయలంపై యూత్ కాంగ్రెస్ పార్టీ దాడి తర్వాత భువనగిరిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న జిల్లా కేంద్రంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. ఆఫీస్ విధ్వంసాన్ని బీఆర్ఎస్ సీరియస్ తీసుకుంది. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అట్నుంచి భారీ ర్యాలీతో ప్రిన్స్ కార్నర్ వద్దకు చేరుకున్నారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. అరగంటపాటు భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. అదే సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్, అనిల్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీని చింపి, చెప్పులతో కొట్టి, దహనం చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దాంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. యూత్ కాంగ్రెస్ దాడికి నిరసనగా ఆదివారం భువనగిరి మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు.

నేడు భువనగిరిలో బీఆర్ఎస్ మహాధర్నా

భువనగిరి అర్బన్ : భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గూండాలు చేసిన దాడికి నిరసనగా ఆదివారం మహాధర్నాకు బీఆర్ఎస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 10 గంటలకు మహాధర్నా ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు శనివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా, పట్టణ, మండల కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులా?

బీఆర్ఎస్ ఆఫీస్‌పై యూత్ కాంగ్రెస్ దాడి దుర్మార్గం

ముక్తకంఠంతో ఖండించిన బీఆర్ఎస్, సీపీఎం, ప్రజా సంఘాలు

దాడుల సంస్కృతి సరికాదంటూ మండిపాటు

యాదాద్రి భువనగిరి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులా..? ప్రజాస్వామ్యంలో పాలక పక్షాన్ని నిలదీయొద్దా..? పిరికిపందలా దాడులకు ఒడిగట్టడం ఏంటి..? విధ్వంస ఘటనలు దుర్మార్గమైన చర్య. అరాచక సంస్కృతిని ప్రోత్సహించడం ఏంటి..? అని బీఆర్ఎస్, సీపీఎం, వివిధ ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. భౌతిక విధ్వంసాలకు పాల్పడం ఏంటని మండిపడుతున్నాయి. దాడిని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డితోపాటు ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. సీపీఎం జిల్లా కమిటీ ప్రత్యేకంగా సమావేశమై కాంగ్రెస్ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక పార్టీ కార్యాలయాన్ని పైళ్ల శేఖర్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నేత క్యామ మల్లేశ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. దాడి ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

అధికారం ఉందనే అహంకారమా..?

'బీఆర్ఎస్ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడి దురదృష్టకరం. ఇలాంటి రౌడీయిజాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంకా మర్చిపోవడం లేదు. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు ఇదే రౌడీయిజాన్ని ప్రదర్శిస్తున్నది. అధికారం ఉందనే అహంకారమా? హుందాగా నర్చుకోవడం సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు తెల్వదు. హుందాగా నడుచుకోవడం నేర్చుకోండి. వీధి రౌడీల్లా ప్రవర్తించడం మానుకోండి. ఇకనైనా బుద్ధి తెచ్చుకోండి. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టేది లేదు. సీఎంకు ఎలాగూ మంచి అలవాట్లు లేవు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఇచ్చే శిక్షణ ఇదేనా? స్వయంగా పోలీసులే దగ్గరుండి దాడులు చేయించారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు రాక ముందే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. స్వయంగా పోలీసులకు తెలిసినా అడ్డుకోపోవడం ఏంటి? అన్నింటినీ ధ్వంసం చేస్తుంటే చేతులు కట్టుకొని కూర్చున్నారా? బాధ్యులైన పోలీసులపైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.'

– గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

'కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయడం సిగ్గుచేటు. ముందు పోలీసులు వచ్చారు. ఆ తర్వాతే కాంగ్రెస్ గూండాలు వచ్చారు. పార్టీ కార్యాలయంలో విధ్వంసం చేస్తుంటే చోద్యం చూశారు. మేం పదేండ్లు పరిపాలించాం. ఏ రోజూ చిన్న దాడి కూడా జరగలేదు. నిన్న కూడా భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెసోళ్లు గూండాయిజం చేశారు. ప్రజలను మభ్యపెట్టి, నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారు. గతంలో మేం అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ఎన్ని మాటలు అన్నారో తెలియదా? రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేస్తారా..? దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.'

– పైళ్ల శేఖర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరగబడే పరిస్థితి

భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై దాడి దుర్మార్గమైన చర్య. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సరికాదు. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలతో పోలీసులు కలిసి దాడులకు పాల్పడుతున్నారని అనడానికి ఇది పెద్ద ఉదాహరణ. దాడులు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీపై ప్రజలే తిరగబడే పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలి. గూండాగిరీని ప్రోత్సహించొద్దు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇలాంటి దాడులు, బెదిరింపులతో మమ్మల్ని ఆపలేరు. ప్రజల పక్షాన కొట్లాడేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుంది. ఏడాదంతా డైవర్షన్ పాలిటిక్స్‌తో వెల్లదీశారు. ఇక ప్రజలను మోసం చేయడం సాధ్యం కాదని.. ఇప్పుడు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దౌర్జన్యాలకు పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలు, వారికి సహకరించిన పోలీసులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి.. చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేదంటే పోలీస్ శాఖపై కూడా ప్రజలకు నమ్మకం పోతుంది.

– గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే

ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే దాడులు

'బీఆర్ఎస్ భువనగిరి జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ ఆటవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గం. కాంగ్రెస్ ప్రభుత్వంలో దాడులు, అక్రమ నిర్బంధాలు నిత్యకృత్యం అమయ్యాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాగే దాడులు జరిగి ఉంటే కాంగ్రెస్‌కు పుట్టగతులుండేవా? ఇందిరమ్మ రాజ్యమంటే హింస, ధ్వంసమేనా? ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే దాడులు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.'

– మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ నేతలు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజకీయాల్లో దాడులు మంచి సంస్కృతి కాదు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

దాడుల సంస్కృతి మానుకోవాలి

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గం. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కాంగ్రెస్ ప్రభుత్వం దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి మాటలతో దాడులు చేస్తే ఆ పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. ఇదేనా మీ సోకాల్డ్ ఇందిరమ్మ రాజ్యం? ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదు. తగిన రీతిలో బుద్ధి చెప్తాం.

– చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు

'బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో దాడులు చేస్తామంటే ప్రతిదాడులు కూడా తప్పవు. ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా? ఫర్నిచర్ ధ్వంసం చేస్తే పెద్ద గొప్ప అనుకుంటున్నారా? ఇది ప్రజాస్వామ్య పద్ధతి కాదు. కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు.'

– బూడిద భిక్షమయ్య గౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

దాడులు పునరావృతమైతే ఉరికించి కొడుతం

'బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలన్ని ధ్వంసం చేసి, దురహంకారంతో వ్యవహరించడం సరికా దు. స్థానిక పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటు. పార్టీ కార్యాలయాలపై దాడులు కా దు.. దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపండి. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడేటోళ్లు కాదు. 14 ఏండ్లు ఉద్యమాలు చేసి, ఎన్నో ఆటుపోట్లకు ఎదుర్కొన్న కార్యకర్తలు ఉన్నారు. ఎవరూ లేనప్పుడు వచ్చి ఆఫీసుపై దాడులు చేయడం చేస్తే దమ్మునోళ్లు కాదు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే ఉరికించి కొడుతం.'

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి

ఇదేనా మీ ప్రజాపాలన?

'బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి పిరికిపంద చర్యలను మానుకోవాలి. మేం దాడులు మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు ఇంట్లో ఉండలేని పరిస్థితి ఉంటుంది. ప్రజలు కాంగ్రెస్‌ను ఓటేసి గెలిపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలి. సర్కారు తప్పులు ఎత్తిచూపిస్తున్నం. ఇదేనా మీ ప్రజాపాలన? ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ దాడుల సంస్కృతిని మానుకోవాలి.

– చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

దొంగ దాడులు చేస్తే ప్రతిఘటన తప్పదు

రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. రేవంత్‌రెడ్డే స్వయంగా అనేకసార్లు బూతులు మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తమ కార్యకర్తలను అదుపులో ఉంచుకోవాలి. కాంగ్రెస్ పార్టీ ఇదే రకంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే తప్పేంటి? మాకు దాడులు చేతగాక కాదు. దొంగ దాడులు చేస్తే ప్రతిఘటన తప్పదు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులపై క్రిమినల్ కేసు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– తుంగ బాలు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

భౌతిక దాడులు సరికాదు

'బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. రాజకీయాల్లో విమర్శ, ప్రతి విమర్శ సహజం. ఆయా సందర్భాల్లో పాలకులు చేస్తున్న పనులపైన విమర్శలు చేస్తుంటారు. ఆ సందర్భంలో ఏమన్నా తప్పు పదాలు మాట్లాడితే తప్పును ఎత్తిచూపేలా ఉండాలి గానీ, దాడులు చేయడం సరికాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందరూ గౌరవించాలి. భౌతిక దాడులకు పూనుకోవడం సమంజసం కాదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సహనం, సమన్వయం కోల్పోతే ప్రజలకు దూరం అవుతుంది. మరోసారి ఇలాంటివి జరుగకుండా చూసుకోవాలి. ఇలాంటి ఘటనలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.'

– ఎండీ జహంగీర్, సీపీఎం యాదాద్రి జిల్లా కార్యదర్శి

డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి

ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి చేసింది శూన్యం

- కేసులతో బీఆర్ఎస్ నేతలను భయపెట్టే ప్రయత్నం
- రుణమాఫీ, రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి, కంచర్ల,

నల్లగొండ, జనవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిందేమీ లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలు అమ లు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మె ల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలు, 420 హామీ లు ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఈ విషయమై నిలదీసిన బీఆర్ఎస్ నేతలను అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల హామీల్లో రూ.15వేల రైతుభరో సా ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలకు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. రుణమాఫీ ఇప్పటి వరకు 30 శాతమే చేసినట్లు తెలిపారు. మూసీ, లగచర్ల, హైడ్రాతోపాటు ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడంతోపాటు రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలపై నిత్యం నిలదీస్తున్న కేటీఆర్‌ను బయపెట్టేందుకే ఈ కార్ రేస్‌లో అక్రమ కేసులు పెట్టినట్లు పేర్కొన్నారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్ విషయంలోనూ కాంగ్రెస్ నేతలు పండుగ చేసుకున్నారంటే వారిపై శాడిజం అర్థమవుతుందన్నారు. హామీలు అమ లు చేయాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు త్వరలో నూకలు చెల్లుతాయని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి పోలీసులతోనే తన పాలన నడిపిస్తున్నారని, కనీసం కలెక్టర్లను కూడా రేవంత్‌రెడ్డి లెక్క చేయట్లేదని పేర్కొన్నారు. ఏసీబీ విచారణకు వెళ్లిన సమయంలో కేటీఆర్ వెంట ఉన్న కార్యకర్తలపైనా కేసులు పెట్టిన నీచ సంస్కృతి కాంగ్రెస్ సర్కారుది అనిఅని దుయ్యబట్టారు.

బీఆర్ఎస్ రైతు ధర్నా వాయిదా

కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతోపాటు రుణమాఫీ, రైతుభరోసా అమలులో మోసాలను ఎండగట్టేందుకు నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆదివారం నిర్వహించ తలపెట్టిన రైతు మహ ధర్నాను వేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ ధర్నాకు తరపున ముందుండి పోరాడేందుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావాలనుకున్నారు. కానీ, సంక్రాంతి నేపథ్యంలో ధర్నాను పార్టీ వాయిదా వేసిందని, పండుగ తర్వాత నిర్వహిస్తామని తెలిపారు.

ఆంధ్రా రెడ్ బుక్ ఇక్కడ అమలు అవుతున్నదా?

కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనలో సాధించింది ప్రశ్నించే గొంతులను నొక్కడం తప్ప ఏదీ లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. ఆంధ్రా రెడ్ బుక్ ఇక్కడ కూడా అమలు అవుతున్నదా అని ప్రశ్నించారు. లగచర్ల బాధితులకు అండగా ఉండడం వల్లే కేటీఆర్‌ను జైల్లో పెట్టాలనే కుట్ర జరుగుతున్నదన్నారు. పదేండ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పారదర్శకంగా పాలన చేస్తే ఏడాది పాలనలో రేవంత్ సాధించేదీమీ లేదన్నారు. రాష్ట్రంలో దొరల పాలన నడుస్తుందన్న రేవంత్ ఇవ్వాల కుటుంబ పాలనకు తెరతీశాడని విమర్శించారు. హాస్టళ్లలో పిల్లలు చనిపోతే కూడా స్పందించని సీఎం బీజేపీ మాటలు విని వారి ఆదేశాలతో పని చేస్తున్నాడన్నారు. రేవంత్ సర్కారుకు దమ్ముంటే తెలంగాణలో ఇప్పుడు రెఫరెండం పెట్టాలని, బీఆర్ఎస్ వంద సీట్లు గెలుస్తుందని చెప్పుకొచ్చారు.

-చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే



రాష్ట్రంలో రాక్షస పాలన

ఏడాది కాలంగా రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మొదటి హామీ ఇచ్చిన రైతులకే పంగనామాలు పెట్టారని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు 30శాతం మందికే చేసిందని, రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలకు ఎందుకు కుదించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఎన్నో దేవుళ్ల ముందు రుణమాఫీపై ఒట్టు వేసిన సీఎం రేవంత్ ఆ పబ్బం గడిచిన తర్వాత మోసపు మార్గాన్ని ఎంచుకున్నాడని విమర్శించారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 5 లక్షల మంది రైతులకు రుణామాఫీ చేయాల్సి ఉండగా 1.75లక్షల మందికే చేశాడని తెలిపారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున రూ.10వేల కోట్లు అప్పు తెచ్చి రైతు భోరోసా, అతీ ఎకరాకు రూ.12వేలే ఇవ్వాలని చూస్తున్నదన్నారు. కేసీఆర్ 11 విడుతలుగా రైతుబంధు రూ.80వేల కోట్లు ఇస్తే మీ సర్కారు ఎందుకు సవ్యంగా ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

-కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



అబద్ధపు హామీలతోనే అధికారంలోకి కాంగ్రెస్

కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అని అబద్దాలు ఊదరగొట్టే అధికారంలోకి వచ్చిందని జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆ హామీలు అమలు చేయలేక ఎగవేత ధోరణి అవలంబిస్తున్నదని విమర్శించారు. రేవంత్ సర్కార్ అమలు చేస్తున్న ఒకటీ రెండు హామీలను కూడా విధి విధానాలతో చేయడం లేదని, ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులను ప్రాతిపదికన ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా అమలు చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ సర్కార్ ఉక్కిరి బిక్కిరి అవుతందని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా అదే స్థాయిలో ముందుకు వెళ్తామన్నారు. రైతు భరోసా అడుగడుగునా బీఆర్ఎస్ ఒత్తిడి చేయడం వల్లే సీఎం రేవంత్ కుట్రలతో కేసులు పెట్టిస్తున్నారన్నారు. సమావేశంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, కొండూరు సత్యానారాయణ, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, జమాల్ ఖాద్రి, కరీం పాష, ఐతగోని యాదయ్య, బొమ్మరబోయిన నాగార్జున, వంగాల సహదేవరెడ్డి పాల్గొన్నారు.

-బండ నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్